అధికారులు సమన్వయంతో సాగాలి



శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

అధికారులతో సమావేశమైన వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్

గచ్చిబౌలి: భారీ వర్షాలకు ఐటీ కారిడార్‌లోని ప్రధాన రహదారులపై వరద నీటి తొలగింపులో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్ అధికారులకు సూచించారు.శనివారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యలయంలో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఐటీ కారిడార్‌లో వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వరద నివారణ చర్యలు, భారీ వర్షం వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జంక్షన్లలో విద్యుత్ స్తంభాల తొలగింపు, అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు, గ్రీన్ వేస్ట్‌పై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ డిప్యూటీ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, డీసీలు రజినీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, సీపీ మల్లిఖార్జున్, ఇంజనీరింగ్, హెచ్ఎండబ్ల్యూస్, టీఎస్ ఎస్‌పీడీసీఎల్, శానిటేషన్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో కొనసాగుతున్న హ్యాండ్లూమ్ ఇండియా ఎక్స్‌పోకు మంచి స్పందన లభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన చేనేత ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కోల్‌కతా, పోచంపల్లి, కలంకారి, బనారస్ సిల్క్, ఉప్పాడ, కాంచీపురం ఉత్పత్తులున్నాయని, ఈ ప్రదర్శన ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని వారు వివరించారు.

త్వరలో తెలుగులో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవస్థాపకులు కిరణ్ చంద్ర, ఓజోన్‌టెల్ సీటీఓ చైతన్య

స్వేచ్ఛ వ్యవస్థాపకులు కిరణ్ చంద్ర

గచ్చిబౌలి: త్వరలో తెలుగులో సాఫ్టవేర్ సొల్యూషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని స్వేచ్ఛ వ్యవస్థాపకులు కిరణ్ చంద్ర పేర్కొన్నారు. డేటా సెట్‌ల ఆధారంగా తెలుగులో చాట్ జీపీటీని తలదన్నేలా ఒక సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. శనివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో 'సమ్మర్ ఆఫ్ ఏఐ'పై ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఇంటర్న్‌షిప్‌లో లక్ష మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, మొదటి విడతలో పది వేల మందికి శిక్షణ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. త్వరలో రెండో విడతలో 30 వేల మందికి, మూడో విడతలో 60 వేల మందికి శిక్షణ ఇస్తామన్నారు. తెలుగుభాష సంస్కృతి, జానపదాలు, కళారూపాలు, పాటలు, కథల రూపంలో నిక్షిప్తమై ఉంటుందన్నారు. వీడియోలు, టెక్స్, వాయిస్ రూపంలో డేటా సెట్‌ను సేకరించి డాక్యుమెంట్లు తయారు చేస్తారని వివరించారు. శిక్షణ తీసుకున్న ఒక్కో విద్యార్థి తాతయ్యలు, అమ్మమ్మ, ఉత్పత్తి కార్మికుల నుంచి డేటా సేకరిస్తారని తెలిపారు. పలు సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో సహకారం అందజేస్తాయని అన్నారు. తెలుగులో చాట్ జీపీటీ కోసం విద్యార్థులతో పాటు ఎవరైనా డేటా సెట్‌ను అందించవచ్చన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీపీఐయూ రాష్ట్ర అధ్యక్షుడు రవి

మియాపూర్: బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దని ఎంసీపీయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ ఎంసీపీఐయూ జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ ఇస్లావత్ దశరథ్ నాయక్ అధ్యక్షతన ముజఫర్ అహ్మద్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980లో మండల్ కమిషన్ ఈ దేశంలో బీసీలు 100కు 52 శాతం ఉన్నారని వారి జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కూడా అదే వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వానికి 1990లో సిఫారసు చేస్తే ఆ నాటి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలన్నారు. వనం సుధాకర్, మైదంశెట్టి రమేష్, అనిల్‌కుమార్, సుకన్య, భాగ్యమ్మ, కళావతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 60, దొండ 50, దోస 60, ఆలు 35, చామ 60, కీర 35, బీర 70, వంకాయ 40, గోకర 60, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 35, క్యారెట్ 60, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 170, వెల్లుల్లి 260.



రోడ్లు జలమయం

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీరు.. ఆగిన రాకపోకలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కొద్దిసేపు కురిసిన వర్షానికే లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కిందకు వరద నీరు చేరడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జీహెచ్ఎంసీ సిబ్బంది అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వరదనీటిని మళ్లించారు.

మియాపూర్: భారీ వర్షం కారణంగా ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



మియాపూర్ దీప్తిశ్రీనగర్ రహదారులపై వర్షపునీరు



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వరద నీరు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ జగదీశ్వర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. మానేపల్లి గోపిచారి, బండోజు నరసింహాచారి, ఎస్ఆర్ రమేష్ చారి, కమ్మరి రామకృష్ణ చారిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్‌రెడ్డి, సందీప్ ముదిరాజ్, వెంకట్ నాయక్, షౌకత్ ఆలీ మున్నా, నవీన్‌రెడ్డి, అనిల్ యాదవ్, నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయికాలనీలోని కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో జరిగిన అమ్మవారి జయంతి వేడుకల్లో శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేష్, ఐలేష్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెరుకు కుమారస్వామి దంపతులు ఈ పూజా, హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు.



అలరించిన నృత్యప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం కలర్స్ ఆర్ ద్యాన్స్ ఎస్ఎస్ఎల్ ప్రవీణ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో అంబపరాకు, పూర్వరంగం, వినాయకకౌతం, తాండవ నృత్యకరి, నమ శివాయతే, ఆనందనర్తన గణపతిమ్, చేరి యశోదకు, అచ్యుతం కేశవం, తిల్లాన, మంగళం తదితర అంశాలను కళాకారులు అక్షిత, అలివేణి,శివాలక్ష్మి, శాన్వి, అనన్య, కళ్యాణి, లావణ్య, ఆశ్రిత, శ్రీపాద, సహస్ర, మోక్షిత, జాహ్నవి తదితరులు ప్రదర్శించారు.

ముగిసిన సమ్మర్‌క్యాంపు

శిల్పారామంలో 15రోజుల పాటు నిర్వహించిన సమ్మర్‌క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని ఎత్నిక్‌హాల్‌లో నిర్వహించారు. వివిధ అంశాలలో శిక్షణ పొందిన 92మంది విద్యార్థులకు శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు సర్టిఫికెట్‌లను అందజేశారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించిన అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీసత్యకీర్తి నృత్యధామం శిష్యబృందం నృత్యార్చనతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. విష్ణు సహస్రనామం, లక్ష్మీఅష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరంతో శ్రోతలను కళాకారులు ఆకట్టుకున్నారు. శ్రీసత్యకీర్తి నృత్యధామం గురువు బాలాజీ కుమార్ దొడ్ల శిష్యబృందం దశావతారం, రామాయణశబ్దం, భామాకలాపం తదితర కీర్తనలకు నృత్యరూపం ఇచ్చారు. కళాకారులు గీర్వాణి, వేద, శ్రీనిక, దుర్గా, వన్షిక పాల్గొన్నారు.





కుంచించుకుపోతున్న నాలాలు



కుంచించుకుపోయిన నాలా



- చిన్నపాటి వర్షాలకే జలమయమవుతున్న కాలనీలు
- నాలాలకు రక్షణ గోడలు నిర్మించాలి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో గొలుసుకట్టు చెరువులకున్న నాలాలు కబ్జాలకు గురై ప్రతి వర్షాకాలం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజా ప్రతినిధులు నాలాలకు ఇరువైపులా కంచెగోడలు ఏర్పాటు చేసి నాలాలు కబ్జాలు కాకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నాలాలకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు వాపోతున్నారు. ప్రగతినగర్ అంబీర్‌చెరువు, కింది కుంట చెరువు, పరికి చెరువు, ఎల్లమ్మ చెరువు, ప్రాంతాల్లోని నాలాలు కుచించుకు పోవటంతో కబ్జాలు చేసిన ప్రాంతాల్లో వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే ఆ చుట్టు పక్కల ఉన్న కాలనీలన్నీ నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. గత వర్షాకాలం ప్రగతినగర్ అంబీర్ చెరువు పరిసర ప్రాంతాలు, పరికి చెరువు పరిసర ప్రాంతాల్లోని ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, చక్రధర్ నగర్ కాలనీ వంటి తదితర కాలనీలు నీట మునిగాయి. బోట్లు



వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువుల నాలాలకిరువైపులా గోడలు లేకపోవటం, నాలాలకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షాకాలం ముంపు ప్రాంతాలుగా మారుతున్నాయి. ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, సాయినగర్, ఆదిత్యనగర్, వివేకానందనగర్, కమల ప్రసన్ననగర్, వేంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్, రామ్‌నరేష్ నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ వంటి ప్రాంతాల్లోని నాలాలకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిని తొలగించి నాలాలకు ఇరువైపులా గోడలు కట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



గొలుసుకట్టు చెరువుల ద్వారా ప్రవహించే నాలాలకు ఇరువైపులా కంచె గోడలు నిర్మించాలి. కబ్జాకు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించి అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలి.

– సూర్యవంశి ప్రలిత్, స్థానికుడు

నేడు హెచ్‌సీయూలో 'వైటథాన్-2024 రన్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆదివారం ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'వైటథాన్-2024' రన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యాంపస్‌లో ఉదయం 5.45 గంటలకు ఈ రన్‌ను మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎన్‌రావు కలిసి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఎల్‌విప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ చైర్ డాక్టర్ ప్రశాంత్‌గార్గ్, ఇన్‌స్టిట్యూట్ ఆపరేషన్ ఐసైట్ యూనివర్సిల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఐ క్యాన్సర్ హెడ్ డాక్టర్ స్వాతి కల్కి, అపోలో క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ అధ్యక్షుడు అభిజిత్ పాల్గొంటారు.

సెలవుల్లో సుకూన్ -24 ఫెస్టివల్ నిర్వహించొద్దు

స్టూడెంట్ యూనియన్‌ను కోరిన హెచ్‌సీయూ యంత్రాంగం

రాయదుర్గం: సెలవులు ఉన్నందున సుకూన్-2024 ఫెస్టివల్‌ను నిర్వహించవద్దని స్టూడెంట్స్ యూనియన్‌కు హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వు జారీ చేసింది. యూనివర్శిటీ తెరిచి ఉన్నప్పుడు విద్యార్థుల పండగ సుకూన్‌ను నిర్వహించాలని సూచించారు.ఈ మేరకు శనివారం హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ఒక అత్యవసర ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వెకేషన్ పీరియడ్ కావడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లినందున అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన లేరని, అలాగే ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేకంగా 13 ఆదేశాలను కూడా నిర్దేశిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేశారు. దీనిని విధిగా పాటించాలని సూచించారు. విద్యార్థులందరూ క్యాంపస్‌కు తిరిగి వచ్చే తదుపరి సెమిస్టర్‌లో ప్రత్యామ్నాయ తేదీలను ప్రతిపాదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారానికి చెందిన కొండపర్తి రమేష్‌బాబుకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం రూ.2లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరుపత్రాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న వారిని ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదన్నారు. మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని శ్రీరామ్‌నగర్‌లో నివసించే నిరుపేద రామయ్యకు ప్రమాదవశాత్తు యాభై శాతం చర్మం కాలిపోయింది. శనివారం రామయ్యకు బీఎస్‌వివై ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ బిఎస్ వీరూ యాదవ్ 20 వేల రూపాయలు అందజేశారు.

26 నుంచి శృంగేరి శారదా శంకరమఠం వార్షికోత్సవాలు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం, శ్రీ శృంగేరి శారదా శంకరమఠము 25వ వార్షికోత్సవాలు ఈనెల 26 ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పూజలు 30వ తేదీ గురువారం వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సిఎస్ఆర్ మూర్తి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. మొదటి రోజు ఆదివారం ఉదయం 7 గంటలకు గురువందనము, గురుపాదుకా పూజ, శ్రీ ఆది శంకరాచార్యుల అష్టోత్తర శత నామార్చన, గణపతి పూజ, కలశస్థాపన, ఋత్విక్ వరుణం, ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, సాయంత్రం 6.30 గంటలకు సంకట హర చతుర్థి గణపతి వ్రతం వంటి ప్రత్యేక కార్యక్రమాలతో పూజ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల భక్తులు విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించవలసినదిగా కోరారు.

అన్నదానం

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామ స్వామి దేవస్థానంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం కార్పొరేటర్ సోదరుడు ఎల్లేష్ యాదవ్ అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం మాస్ ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భెల్ జీఎం హెచ్ఆర్ శ్రీనివాస్‌రావు, జీఎం చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా భెల్ కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును నిర్వహించడం సంతోషకరమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిత్యం యోగా , ఆటలకు కేటాయించాలని కోరారు. చిన్నారులకు వారికి నచ్చిన క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. భెల్ టౌన్‌షిప్ క్రీడాకారులకు నిలయమన్నారు. కార్యక్రమంలో సీసీ ప్రధాన శ్రీకాంత్, సీనియర్ మేనేజర్ మయబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం ముత్తంగి వైపు నుండి రుద్రారానికి బైక్‌పై వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు ఇస్నాపూర్ సమీపంలోకి రాగానే నడుచుకుంటు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి (35-40)ని శుక్రవారం అర్ధరాత్రి ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలై ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.